


"రండి. ఎవరు కావాలి మీకు?"

"నీలిమా దేవిగారు ... వారు సామాన్యంగా శనివారంనాడు షూటింగ్‌లకు వెళ్ళరని, ఎవరొచ్చినా ఈరోజు సావకాశంగా మాట్లాడుతారనీ తెలుసుకొని వచ్చాను."

"అదీ నిజమే .... మిమ్మల్ని గురించి తెలుసుకోవచ్చునా."

"నన్ను జగ్‌మోహన్ అంటారు. నాకు జీవితచరిత్రలు రాయడంతో కుతూహలం ఎక్కువ."

"ఓహో! .... కొంపదీసి మా నీలిమ జీవిత చరిత్ర రాద్దామనే ఉద్దేశంతో రాలేదుకదా!"

"సరిగ్గా ఊహించారు. నేను అదే పనిమీద వచ్చాను. వారికి అభ్యంతరం లేకపోతే...."

"రాయించుకోవడానికి మా నీలిమకూ, రాయడానికి మీకూ అభ్యంతరం లేకపోవచ్చు. కాని చదవడానికి ప్రపంచానికి అభ్యంతరం ఉండొచ్చు గదా!"

"క్షమించాలి. మీరు బహుశా నీలిమాదేవిగారి అక్కగారయిఉంటారు. మీ చెల్లెలి విషయం నేను మీకు వేరే చెప్పవలసిందేమీలేదు మీరే నాకు వారి

విషయంలో సాయం చేయవలసి ఉంటుంది. నా విషయంలో .... నన్ను గురించి గొప్పగా చెప్పుకోవాలనే ఉద్దేశం నాకు ఏకోశానా లేదు. అయితే ఒక్క విషయం చెప్పక తప్పదు. నా రచనలపట్ల ప్రపంచానికి ఎనలేని సానుభూతి ఉందని నా నమ్మకం."

"ఓహో! ఆమాత్రం ధైర్యం మీ పట్ల మీకు ఉంటే ఫరవాలేదు ...... అయినా మీకు మా నీలిమ జీవితచరిత్రే రాయాలనే కోర్కె ఎందుకు కలిగింది? తను పెద్దశ్రేణి తార అవడంవల్ల, చాలామందికి తనపట్ల మోజు వుంది కదా. అందుచేత తన జీవితచరిత్ర రాస్తే పుస్తకాలెక్కువ అమ్ముడు పోయి డబ్బు బాగా చేసుకోవడానికి వీలవుతుందనా?"

"మీరు నా విషయంలో చాలా అపోహ పడుతున్నారు... డబ్బు బాగా సంపాదించడానికి మార్గాలు చాలానే ఉంటాయి. దానికి నీలిమాదేవిగారి జీవిత చరిత్ర రాయడం ఒక్కటే మార్గం కాదు."

"మీ రన్నదీ నిజమే ... అయితే ఈ మార్గం చేపడితే ఒక్క దెబ్బతో రెండు మూడు పిట్టలు రాలుతాయి కదా అని."

"అంటే ... క్షమించాలి. నాకు బోధపడలేదు."

"నాకు సంస్కృతం రాదు కనుక, తెలుగులోనే మాట్లాడుతున్నాను. మీకు నే నన్నది నిజంగా అర్థంకాక, టీకా తాత్పర్యం అడుగుతున్నా రను కునేటంతటి తెలివితక్కువదానిని కాను అయినా అడిగారు కనుక, సాఫూ ప్రస్తుతం మరో కాలక్షేపం లేదు కనుక. ఓపికగానే మాట్లాడుకుందాం, సావకాశంగా కూచుని."

జగ్‌మోహన్‌కి అనుకోకుండానే నవ్వువచ్చింది. "మీరు చాలా తెలివిగా మాట్లాడుతున్నారు. ఇంతకీ మీరు నే నడిగింది చెప్పలేదు. మీ రన్నమాటా వాస్తవమే...నాకు బోధ పడకపోలేదు నీలిమాదేవిగారి జీవితచరిత్ర రాయడం వల్ల నాకు డబ్బూ, పేరూ, నీలిమాదేవి గారికి మరింత ఖ్యాతీ వస్తాయని కదూ మీ భావన."

"అదీ. మీ రనుకున్నది నిజమో కాదో నిర్ధారణ చేసుకోవడానికి మాత్రమే అడిగారు నన్ను ... ఖచ్చితంగా అంతే."

"రాక్‌లనిండా పుస్తకాలే! మీ రెక్కువగా చదువుతూ ఉంటారా?"

"అవన్నీ నా నేస్తాలు ... నిజానికి వాటిని చదివి అర్థంచేసుకునే పాటి చదువు సంధ్యలు మా కెవరూ చెప్పించ లేదు ... మాకు చిన్నప్పుడే తల్లి దండ్రులు పోయారు. మేనమామ పెంచాడు కొన్నాళ్ళు. తరవాత మా పెద్దకామందు కొడుకు మమ్మల్నీ



పట్టణం చేర్చి, సినిమాలలో చేరడానికి అవకాశం కల్పించాడు "

"ఆయనే నీలిమాదేవిగారిని తర్వాత వివాహం చేసుకున్నట్లున్నారు కదూ !"

"ఓహో ! అయితే మా నీలిమను గురించి కొంత ఫోగట్టా తీసుకునే వచ్చారన్న మాట అయితే నేను ఎక్కువగా చెప్పవలసిందేమీ లేదు . ఆయనని పెళ్ళి చేసుకొనే ధైర్యం నాకు లేకపోయింది సినిమాలలో చేరాక నీలిమను చేసుకునే ధైర్యం ఆయనకు లేకపోయింది .. కొన్నాళ్ళు అలానే కాలక్షేపం చేశాం తరవాత ఆయన సినిమారంగంనుంచి మైకా వ్యాపారానికి మారారు "

"క్షమించాలి చిన్న సందేహం ఆ మధ్య ఇంగ్లీషులో వెలువడిన సినిమా మాగజైన్‌లో 'మిసెస్ నీలిమాదేవి' అని పడింది, బహుశా అది అచ్చుపొరపాటేమో !"

"అబ్బెబ్బే ! అచ్చు పొరపాటేమీ కాదు మీ ఊహ పొరపాటు తను కన్య కాదు కనుక మిస్ అని పెట్టుకుంది తానెవరి మిసెస్సో తనకే నిర్ధారణగా తెలియదు కనుక మిసెస్ నీలిమాదేవి అని మిసెస్ ప్రక్కన తన పేరే చేర్చుకుంది "

జగ్ మోహన్‌కి ఆవిడ మాటలు వింటుంటే అబ్బురంతో పాటు, ఖంగారు కూడా పడ్డాడు. ముచ్చెమటలు తుడుచుకుంటూ, మంచినీళ్లడిగాడు. అయితే మంచినీళ్ళతో పాటు చేరో కాఫీ, బిస్కెట్లుకూడా వచ్చాయి.

రాక్‌లలో పేర్చి ఉన్న ఇంగ్లీషు, తెలుగు పుస్తకాలవేపు చూస్తూ "మీరు పెద్దచదువులు చదవకపోయినా సాహిత్యంలో ఇంతటి అభిలాషను పెంపొందించుకోవడం చూస్తే నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు జగ్ మోహన్.

"మొదట్లో నీలిమకు వార్డ్‌రోబ్ నింపాలా లేక ఈ పుస్తకాల రాక్‌లు నింపాలా అని తికమకగా ఉండేది. ఈ సినిమారంగంలో మొదటి అయిదేళ్లూ సినిమాలలో వేషం వేయడంవల్ల వచ్చిన కొద్దిపాటి డబ్బుకంటె దగ్గర స్నేహితు లిచ్చే ప్రెజెంట్స్ మీదనే మేం ఎక్కువగా గడుపుకోగలిగే వాళ్ళం. అప్పుడప్పుడు నీలమ తన దగ్గరి స్నేహితులకు ఈ పుస్తకాల బిల్లులు అందజేస్తూఉండేది. అవి చీరల బిల్లులు కాకపోవడంవల్ల ఒక విధంగా నిరుత్సాహపడి, నెమ్మది నెమ్మదిగా వాళ్ళు దూరమయిపోతూఉండేవారు. తమ స్నేహితురాలు అందమైన మెత్తటి సిల్కు చీరలు కట్టుకుని, ముఖానికి పరిమళ పౌడర్లు అద్దుకొని తమని ఆనందపరచాలనుకునేవారిని, ఈ పుస్తకాలని గురించిన కబుర్లు, వాటి బిల్లులు అయోమయంలో పడవేసేవి ... ఇంతకీ...నా సాహిత్యాభిలాషను గురించి కదూ మీ రంటున్నదీ! అవును ... నేను పెద్దగా చదువుకోకపోయినా, మా నీలిమకు ఆ రోజుల్లో ఒక పెద్ద మేధావితో స్నేహం ఉండేది ... ఆయన ఇప్పుడు లేడు ఆయన దగ్గర నేను ఇగ్లీషూ, తెలుగూ నేర్చుకున్నాను ఆ అయిదేళ్ళపాటూ"

"అవును, ఈ సంగతి విన్నాను"

"మీరు విన్న దేమిటో నాకు తెలుసు అయితే అందులో ఏ మాత్రం నిజం లేదు...అందరూ అనుకునే సంబంధం మా నీలిమకూ ఆయనకూ మధ్య ఉండి ఉంటే బహుశా ఆ అయిదేళ్ళూ నే నాయనదగ్గిర అంతగా దీక్షతో చదువు సంధ్యలు నేర్చుకోగలిగి ఉండేదానిని కాదు ... మీరూ రచయిత వంటున్నారు కనుక బహుశా మీ రిది వినడానికి కుతూహల పడవచ్చు ... ఒకరోజు పదిహేనేళ్ళక్రితం ఒకతను, 'సైడ్ రోల్స్ వేసేవారిని, పాఠకులకు పరిచయం చేసే ఉద్దేశంతో ఉన్నాను ఈసారి మిమ్మల్ని పరిచయం చేయాలని వచ్చాను' అంటూ తనతోపాటే వచ్చిన మరొక వ్యక్తిని నాకు పరిచయం చేసాడు ఆరోజు అనుకోకుండా భారీ వర్షం రావడంవల్ల ఆరోజు వా రిద్దరూ



"అవునండీ ఇవ్వాళటినుంచీ అక్కయ్యకు కర్ఫ్యూ. మీరు చూట్టానికి వీల్లేదు!"

సాయంత్రం వరకూ మా ఇంట్లోనే ఉండవలసివచ్చింది. ఆ రచయిత వస పోసిన పిట్టలా మాట్లాడుతూనే ఉన్నాడు. కాని ఆ రెండవ వ్యక్తి ఆఁ ఊఁ అనడం కంటె మరెక్కువ మాట్లాడలేదు. ఏదో పోగొట్టుకున్న వ్యక్తిలా, ఎక్కడో ఆలోచిస్తున్నట్టుగా, ఎవరికో ఏదో పెద్ద సాయం చేయవలసిన బాధ్యత తనమీద ఉన్నట్టుగ, ఒకసారి చూస్తే మళ్ళీ మర్చిపోలేనంత తమాషా కనిపించాడు. మా నీలిమను చూసి ఎంతో జాలిపడుతున్నట్టుగా కనిపించాడు. వెళ్ళే ముందు మా నీలిమతో,'మీ రింత తెలివిగా మాట్లాడగలరు. ఏ విషయాన్నయినా క్షణంలో పట్టివేయగల నేర్పు ఉంది. మీరు ఇంగ్లీషుకూడా నేర్చుకుని ప్రపంచ సాహిత్యం అంతా చదవాలి' అన్నాడు.

"మా నీలిమ తన మామూలూ ధోరణిలో నవ్వుతూ, 'ఇంగ్లీషుతోపాటు, తెలుగుకూడా మీరు నేర్పితే నాకేమీ అభ్యంతరం లేదు' అంది...ఆ తరువాత అయిదేళ్ళూ ఆయన మా ఇంటికి వచ్చి నాలుగయిదు గంటలు కాలక్షేపం చేయనిరోజు లేదు....

"ప్రపంచ సాహిత్యాన్ని నమిలి మింగేద్దామన్నంత తీరని నా తృష్ణను ఆయన గుర్తించి ఆ అయిదేళ్ళూ నాకు ఇంగ్లీషు, తెలుగు నేర్పారు.

వాటిని నాకు నేనుగా చదువుకునే స్థితికి నన్ను తీసుకువచ్చారు...ఆయన నాకు గురువు. మా నీలిమకు ప్రాణ స్నేహితుడు. అంతకుమించి మాకూ ఆయనకూ మరో విధమైన సంబంధ మేమీ ఉండేదికాదు. నన్ను మనిషిగా మలిచిన ఆ వ్యక్తిని ఎప్పటికీ మరిచి పోలేను."

గతంలోకి దిగబడిపోయిన ఆవిడ దిగులుముఖాన్ని జూచి విషయం మార్చడానికిగాను జగ్ మోహన్, "క్షమించండి. నాకు మరికొన్ని విషయాలు తెలపాలి... ఆ అయిదేళ్ల తరువాత నీలిమాదేవిగారు ముఖ్య పాత్రలు ధరించడం మొదలుపెట్టా రనుకుంటాను" అన్నాడు.

"అవును...తరువాత అన్నీ కలసి వచ్చాయి. డబ్బూ, పేరూ ఊకమ్మడిగా వచ్చిపడ్డాయి. బీరువాలనిండా బట్టలు నగలు; మేడా, మేడనిండా నౌకర్లూ ఈ హంగులన్నీ ఏర్పడ్డాయి ఇలా పదేళ్ళు గడిచాయి."


"తరువాత – తరువాతే మీలేదు... డబ్బు నేరుగా తనకి రావడం తక్కువయింది. డబ్బు అవసరంగల సంస్థలకీ, బీద విద్యార్థులకీ, ఆర్థికావస్థలలో ఉన్న వ్యక్తులకూ ఎక్కువగా చేరడం మొదలుపెట్టింది. పేరూ ఖ్యాతిపట్ల ఆదరణ తగ్గింది."

ఫోన్ మోగింది ఆవిడ రిసీవర్ అందుకుని, "హలో! ఆ! ఆ! ఆ! హెరాయిల్ వాళ్ళకి అందుకనే ఒప్పుకుంది. వాళ్ళకి ఫోన్ చేసి మీకు కావలసిన మొత్తం చెప్పండి. చెక్కు రాసి ఇస్తారు...ఈ వారం ఒక పిల్ల మళ్ళీ డస్ట్ బిన్‌లో దొరికిందా? ఈ ప్రపంచంలో పుట్టడం ఎలా జరిగినా, ఒకసారి పుట్టడం అంటూ జరిగితే ఆ తరువాత బ్రతకడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది ... కృతజ్ఞతలా ... ఎవరికీ?...ఎవరి కర్తవ్యాన్ని వాళ్ళు నెరవేరుస్తున్నాం తోచినవిధంగా... అంతే...బై."

ఆవిడ రిసీవర్ పెట్టేయడం చూసి. "నీలిమగారిని ఇలాంటి ధర్మకార్యాలకు ఎక్కువగా ప్రోత్సహిస్తున్నది, మీరే అని తోస్తోంది నాకు...ఒప్పుకుంటారా" అన్నాడు జగ్ మోహన్.

"ఒక విధంగా...డబ్బూ, ఖ్యాతీ మనిషిని సాధ్యమయినంతవరకు అట్టడుగుకి లాగడానికి ప్రయత్నిస్తాయి... మనిషిని స్వార్థపరుడ్నిగా చేయడానికి ప్రయత్నిస్తాయి. మా నీలిమకు వాటిని అధిగమించాలన్న కోర్కె మాత్రం ఉంది. దానికి నేను చేయూతనిస్తాను .... అంతకు మించి నేనుకాని, మా నీలిమకాని చేస్తున్న ఘనకార్యం మరేమీ లేదు."

జగ్ మోహన్ వాచ్ వంక చూసుకుని సలుదిక్కులా ~రికించడం చూసి,



ఆవిడ "ఓ ! మర్చిపోయాను చెప్పడం. నీలిమ తప్పనిసరిగా పనిమీద వెళ్ళవలసి వచ్చింది ప్రొద్దుటే. మరో గంటసేపటికి కాని రాదు...మీ రేదో మరో పనిమీద వెళ్ళవలసిఉన్నట్టుంది. తాను వచ్చాక మీరు వచ్చి వెళ్ళారని చెబుతాను," అంది.

"ఫరవాలేదు పెద్ద పనేమీ లేదను కోండి. నీలిమాదేవిగార్కి పి లెప్పు డుంటుందో చెబితే మళ్ళీవచ్చి కలుస్తాను. అయితే మీరింకా నాకు కొన్ని వివరాలుకూడా ఇస్తే నా కింకా ఉపయోగకరంగా ఉంటుంది."

"ఇంకా అట్టే వివరా లేమీ లేవు. కాస్త ఆకారాన్ని గురించే చెప్పాలి. మీరు మళ్ళీ నీలిమను కలుసుకునే పెద్ద అవసరంకూడా అట్టే లేదనుకుంటాను. నీలిమ అచ్చం నాలాగే ఉంటుంది. తను కాస్త మేకప్ బాగా చేసుకుంటుందికనుక నా కంటె నదరుగా కనపడుతుంది. జుట్టు నాది ముందుగా నెరిసింది. తన దింకా నెరవనట్టుగా ఉంటుంది. ఒడ్డూ, పొడుగూ, లావూ ఇద్దరం ఒక్కటే. ఒకసారి ఒక ప్రొడ్యూసరు అన్నారు నీలిమకు జ్వరంవచ్చి షూటింగ్‌కు వెళ్ళలేకపోతే, 'మీరు రండి పోనీ.... మేకప్ చేస్తే మీరూ అచ్చంగా నీలిమలాగానే ఉంటారు' అని. నాకు వయసే నలభయ్. మా నీలిమకు ముప్ఫయ్యయిదు. తనకు నటించడమే జీవితం నాకు నటించకుండా, సహజంగా బ్రతకడమే జీవితం. ఇంతేడా,...ఒక్కొక్కక్షణం అనిపిస్తుంది నాకు, 'భగవంతుడు మమ్మల్నిద్దర్నీ బింబప్రతిబింబాల్లా బ్రతకమని అక్కచెల్లెళ్లుగా పుట్టించాడా అని.'వయసులో అయిదేళ్ళ తేడా లేకపోతే, మమ్మల్నింకా కవల లనే అనుకుని ఉండేవారు. ఇంతకీ మీ కింకా నీలిమ జీవిత చరిత్రను రాయాలన్న కోర్కె బలంగా ఉందా?"

"అంతేకాదు .... నీలిమాదేవిగారి అక్కగారి జీవితచరిత్రను కూడా రాయాలని ఉంది" అన్నాడు జగ్‌మోహన్ నవ్వుతూ.

"నిజమా! మీకు పుణ్యాంఉంటుంది. 'జీవితచరిత్ర' అన్నది మరీ బరువుగా ఉంది. ఈ వయసులో అంతబరువు మోయలేను. రచయితకు రాయడం అలవాటు కనుక, నీలిమాదేవి అక్క మీద ఒక చిన్నకథ రాస్తే రాయండి" అంటూ జగ్‌మోహన్‌ని గుమ్మంవరకూ సాగనంపిందినీలిమాదేవి.

